క్లుప్తంగా

ధాన్యం కాంటాలు వెంటనే చేపట్టాలి



మాక్లూర్: మండలంలో రైతులు వరిధాన్యం ఆరబెట్టి పదిరోజులు కావస్తుందని, వెంటనే కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు ప్రారంభించాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండలంలోని అడవి మామిడిపల్లి, గుత్ప శివారులో రైతులు ఆరబెట్టుకున్న వరి ధాన్యాన్ని శనివారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. అధికారులు, పాలకులు స్పందించి ఆలస్యం చేయకుండా కాంటాలు జరిపి వెనువెంటనే రైతులకు డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు అనీల్, పులి యుగంధర్, అల్జాపూర్ రాజేష్, చింత ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



మాక్లూర్: మండలంలోని కృష్ణనగర్‌లో శనివారం సీపీఐ (ఎంఎల్) నాయకులు ధర్నా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. చత్తీస్‌ఘడ్‌లో ప్రత్యేక ఆపరేషన్ పేరుతో జరుగుతున్న హత్యాకాండను వెంటనే నిలిపివేయాలనే డిమాండ్‌తో ఈ నెల 8న హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ధర్నాకు ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిరాయత్ నగర్ హనుమాన్ మందిర అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంబల్ల తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా నూకల శేఖర్, కోశాధికారిగా కర్తన్ నవీన్ ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా రవీందర్ రెడ్డి, రవి, సాంస్కృతిక కార్యాదర్శిగా ఖాందేష్ సత్యం, సంయుక్త కార్యదర్శులుగా పిట్ల శ్రీధర్, రమణ, గౌరవ అధ్యక్షుడిగా విట్టోభ శేఖర్ ఎన్నికైయ్యారు. పీసీసీ మాజీ కార్యదర్శి ఖాందేష్ శ్రీనివాస్, వందన లక్ష్మి నారాయణలు నూతన కార్యవర్గంను సన్మానించారు. రమేష్, రామ్ ప్రసాద్, అశోక్,మహేష్, సుమన్‌శర్మ ఉన్నారు.

తాడ్‌బిలోలి రామాలయ కార్యవర్గం..



రెంజల్(బోధన్): మండలంలోని తాడ్‌బిలోలి రామాలయం నూతన పాలకవర్గాన్ని దేవాదాయ శాఖ నియమించింది. చైర్మన్‌గా కార్కాణ శ్రీనివాస్‌తోపాటు డైరెక్టర్‌లుగా గంగాధర్, అశోక్, నరేష్, సాయమ్మ నియమితులయ్యారు. శనివారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి వారితో ప్రమాణా స్వీకారం చేయించారు.

కార్మికుడిపై దాడిచేసిన వారిపై కేసు నమోదు



బోధన్‌టౌన్(బోధన్): చెత్త సేకరణకు వెళ్లిన బోధన్ బల్దియా కార్మికుడు వెండి అశోక్‌పై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. వివరాలు ఇలా.. అశోక్ చెత్త సేకరణ కోసం ఆటో తీసుకొని రాకాసీపేట్ కాలనీకి వెళ్లగా అదే కాలనీకి చెందిన మహ్మద్ ఖలీం, ఇమ్రాన్, షేక్ అహ్మద్ రోజూ చెత్త సేకరణకు ఎందుకు రావడం లేదని తిడుతూ అశోక్‌పై దాడికి పాల్పడ్డారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని మున్సిపల్ కార్మికులు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఇలాంటి ఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీఐను కోరారు.

పంటకోత ప్రయోగం పరిశీలన



బోధన్‌రూరల్: మండలంలోని ఏరాజ్‌పల్లి గ్రామంలో పంట కోత ప్రయోగాన్ని బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. రబీ సీజన్‌లో పంటల దిగుబడులను లెక్కించే క్రమంలో శనివారం గ్రామంలోని రైతుల పొలంలో పంటల కోత ప్రయోగాన్ని నిర్వహించి దిగుబడిని లెక్కించారు.

జాతరకు సిద్ధమైన అంకాపూర్

- గ్రామ చరిత్రలో మొదటిసారి శ్రీరామనవమి రథోత్సవానికి ఏర్పాట్లు
- గ్రామస్తుల సహకారంతో రామాలయంలో రథం ఏర్పాటు

ఆర్మూర్: రైతుల ఐకమత్యం.. ఆధునిక వ్యవసాయం.. విత్తన వ్యాపారం.. దేశీ కోడి వంటకాలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆర్మూర్ మండలం అంకాపూర్ వాసులు ఆధ్యాత్మిక బాట పట్టారు. తమ గ్రామంలో ఆలయాలు, భక్తులు ఉన్నప్పటికీ గ్రామ వీధుల్లో రథంపై ఉత్సవ విగ్రహాల శోభాయాత్ర, జాతరలు మాత్రం గ్రామస్తులు ఎన్నడూ జరుపుకోలేరు. తాజాగా



అంకాపూర్ శివారులోని రామాలయంలో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన రథం

గ్రామంలోని పలువురు ఔత్సాహికులు హిందూ సేవా సమితిని ఏర్పాటు చేసి గ్రామ చరిత్రలో మొదటిసారి ఆదివారం శ్రీరామ నవమిని పురస్కరించుకొని రాములవారికి శోభాయాత్ర, జాతర నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా గ్రామస్తులందరి భాగస్వామ్యంతో రూ. ఐదు లక్షలకు పైగా వ్యవయంతో కమ్మర్‌పల్లిలో రథాన్ని తయారు చేయించి ఆలయానికి తరలించారు. గ్రామాభివృద్ధి కమిటీ, హిందూ సేవా సమితి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ జాతర, శోభాయాత్రను విజయవంతం చేయడానికి ఏర్పాట్లు ముమ్మరం చేసారు. ఇతర పట్టణాలు, గ్రామాల్లో స్థిరపడ్డ అంకాపూర్ వాసులు సైతం ఈ పర్వదినాన గ్రామంలో జాతర, శోభాయాత్రకు హాజరు కావడానికి స్వగ్రామానికి చేరుకుంటున్నారు.

భక్తులు తరలిరావాలి..



అంకాపూర్ గ్రామ చరిత్రలో మొదటిసారిగా శ్రీరాముల వారి కల్యాణం సందర్భంగా శోభాయాత్ర, జాతర నిర్వహిస్తున్నందున అధిక సంఖ్యలో భక్తులు హాజరై, దైవ కార్యాన్ని విజయవంతం చేయాలి. ఇకపై ప్రతీఏటా ఈ కార్యక్రమాలను కొనసాగిస్తాం.

– నల్ల మోహన్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు, అంకాపూర్, ఆర్మూర్ మండలం

విరాళాలతో రథం చేయించాం..

గ్రామస్తులందరికీ తమది అన్న భావం కల్పించడంలో భాగంగా హిందూ సేవా సమితిని స్థాపించాం. విరాళాలు సేకరించి రథాన్ని తయారు చేయించాం. అంకాపూర్ గ్రామస్తులు ఆధ్యాత్మిక బాటలో పునీతం కావడంతో పాటు రాముల వారి సేవకు ముందుకు రావడం చాలా ఆనందంగా ఉంది.



– నల్ల చిన్న బొర్రన్న, అధ్యక్షుడు, హిందూ సేవా సమితి, అంకాపూర్, ఆర్మూర్ మండలం

శ్రీరామ నవమికి ఆలయాల ముస్తాబు



నందిపేటలో ముస్తాబవుతున్న రామాలయం

సాక్షి నెట్‌వర్క్: ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లో రామాలయాల్లో శ్రీరామనవమి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆయా నియోజకవర్గాల్లోని మండలాలు, గ్రామాల్లోని రామాలయాలను స్థానిక వీడీసీలు, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే ఆలయ ఆవరణల్లో కల్యాణ మండపాలను, చలువ పందిళ్లను వేశారు. నందిపేట్ మండలం కొల్‌పూర్ భూమయోగేశ్వర ఆశ్రమంలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న రామ నవమి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆర్మూర్‌లోని నవనాథ సిద్ధుల గుట్టపైన గల రామాలయంలో నందీశ్వర మహారాజ్, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కల్యాణ పందిరిని మామిడిఆకులతో వేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. శనివారం నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో పెళ్లి పందిరి వేసి తోరణాలు కట్టారు. రెంజర్లలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంలో ఊరేగింపు నిర్వహించారు.



కిసాన్‌నగర్‌లో ముస్తాబైన రామాలయం



విద్యుత్ కాంతుల్లో పడగల్‌లోని రామాలయం



కిసాన్‌నగర్ రామాలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు





ఆర్మూర్‌లోని నవనాథ సిద్ధుల గుట్టపై పందిరి వేసి తోరణాలు కడుతున్న నిర్వాహకులు

రిజర్వాయర్ మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

నవీపేట/రెంజల్(బోధన్): నవీపేట మండలంలోని అభంగపట్నం రిజర్వాయర్ మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని అభంగపట్నం, నవీపేట, నాగేపూర్ గ్రామాలలో శనివారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం అభంగపట్నంలో రైతులు సాగునీటి సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. రిజర్వాయర్‌లో నీరు తక్కువగా ఉందని, మరమ్మతులు చేసేందుకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే ఇరిగేషన్ ఈఈ బలరామ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజుల్లో మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని, ఎలాంటి సమస్యలు లేవని ఆయన అన్నారు. అనంతరం రెంజల్ మండలంలోని నీలా గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. సమీపంలో ఉన్న రైస్‌మిల్లులకు ట్రాక్టర్ల ద్వార ధాన్యం తరలించుకోవాలని రైతులకు ఎమ్మెల్యే సూచించారు. జిల్లాలో 60శాతం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు మంజూరు చేసినట్లు వివరించారు. యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలన్నారు. ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ తాహెర్‌బిన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, నాయకులు నగేష్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, సాయరెడ్డి, సంజీవ్‌రెడ్డి, గోపాల్, వసంత్, ప్రవీణ్, మొబిన్‌ఖాన్, సాయరెడ్డి, రాము లు, ధనుంజయ్, అనీల్, రాజు, కార్తీక్, కిరణ్, సు మన్, ఇందిరారెడ్డి, గంగాకిషన్, గయాస్, పుర్కా న్‌బేగ్, నీలా విండో చైర్మెన్ ఇమ్రాన్, రఘు పాల్గొన్నారు.



అభంగపట్నంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఘనంగా పంపా సాహితీ పీఠం కవి సమ్మేళనం

బోధన్: పట్టణంలోని ఉషోదయ జూనియర్ కళాశాలలో శనివారం బోధన్‌కు చెందిన పంపా సాహితీ పీఠం అధ్వర్యంలో కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ముందుగా పీఠం ప్రతినిధులు, కవులు, ముఖ్య అతిథులు పంప కవి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఉమ్మడిజిల్లాలోని కవులు, రచయితలు సమ్మేళానికి అధిక సంఖ్యలో హాజరై, వివిధ అంశాలపై కవితాగానం చేశారు. ఈసందర్భంగా కవులకు, పీఠం ప్రతినిధులకు సన్మానం చేశారు. బోధన్ తహసీల్దార్ విఠల్, ఎంఈవో నాగయ్య, పోతంగల్ ఎంఈవో లోల శంకర్, పీఠం అధ్యక్ష, కార్యదర్శులు పురాణే అజయ్ కుమార్, పబ్బమురళి, ప్రిన్సిపల్ ఆనంద్‌రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, కాట్రగడ్డ భారతి, మొగిలి స్వామి రాజ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు, రచయితలను సన్మానిస్తున్న పీఠం ప్రతినిధులు

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



మాక్లూర్: మండలంలోని కల్లెడి గ్రామంలో శనివారం మాక్లూర్ విండో చైర్మన్ బూరోల్ల అశోక్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వైస్ చైర్మన్ గుండారం శేకర్, డైరెక్టర్లు పులిమంటి గంగారాం, రమేష్, అజ్జు నాయక్, సీఈవో బి ప్రవీణ్ ఉన్నారు.

రుద్రూర్: పోతంగల్ మండలం సుంకిని గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటి చైర్మన్ గైక్వాడ్ హన్మంతు ప్రారంభించారు. ఐకేపీ సీసీ సాయిబాబా, మహిళ సమాఖ్య సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు

నవీపేట: పార్లమెంట్‌లో వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందడంతో శనివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. మోదీ చిత్రపటానికి పూలమాలలు వేసి, స్వీట్లు పంచుకున్నారు. నాయకులు ధ్యాగసరిన్, ఆనంద్, రామకృష్ణ, పిల్లి శ్రీకాంత్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగ విలువలను కాపాడుకోవాలి



సాలూర మండలం జాడిజమాల్‌పూర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోధన్/కమ్మర్‌పల్లి/నందిపేట్/రెంజల్/పెర్కిట్: భారత రాజ్యాంగం విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కాంగ్రెస్ నేతలు అన్నారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో శనివారం జై బాపు–జైభీం–జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులు పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా మండలాలు, గ్రామాల్లోని గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలు గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంపై కేంద్రం చేస్తున్న కుట్రలను స్థానికులకు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ రాజ్యాంగాన్ని అవమాన పరుస్తోందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించాల్సిన పాలకులే నేడు నాశనం చేస్తున్నారని మండి పడ్డారు. ఐడీఎంఎస్ చైర్మన్ బాదవత్ తారచంద్ నాయక్, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి, ఎన్డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి, ర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు



మామిడిపల్లిలో పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



నందిపేట మండలం అయిలాపూర్ గ్రామంలో..



అంబేడ్కర్‌నగర్‌లో..

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో శనివారం స్వాతంత్ర్య సమరయోధుడు, దివంగత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అన్ని మండలాలు, గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు స్థానిక నాయకులు, వివిధ కులసంఘాల నేతలు, ప్రజా ప్రతినిధులు, యువజనసంఘాల సభ్యులు, అధికారులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఉప ప్రధానిగా దేశానికి ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



బోధన్ పట్టణంలో..



సాలూర మండల కేంద్రంలో ..



ఆర్మూర్ మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో..



గోవింద్‌పేట్ గ్రామంలో..



మోర్తాడ్‌లో..



మెండోరా మండలం సోన్‌పేట్‌లో..



చందూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బాన్సువాడ ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి



వేల్పూర్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



ఆర్మూర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

వేల్పూర్: జాన్కంపేట్‌లో ఓ బాధిత కుటుంబానికి శనివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బీఆర్‌ఎస్ నేతలు అందజేశారు. రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యంరెడ్డి, చందన్‌కుమార్, శేఖర్, రాజన్న, బాల్‌రెడ్డి, గంగారాంఉన్నారు.

సంక్షిప్తం

ఏఎంసీ ఇన్‌చార్జి చైర్మన్‌కు సన్మానం



బోధన్: సాలూర మండలంలోని హున్సా గ్రామానికి చెందిన చీల శంకర్ ఇటీవల బోధన్ ఏఎంసీ ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈసందర్భంగా శనివారం సాలూరలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

రుద్రూర్: కోటగిరి, రుద్రూర్ మండలకేంద్రాల్లో శనివారం మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ సెగ్మెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ గంగాధర్ దేశాయ్, భీమా సాయరెడ్డి, సలీం, సాయిబాబా, సయ్యద్ ముల్తాని, అత్కురి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

బాల్కొండ: మెండోరా మండలం నడిమితండాలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి ప్రారంభించారు. సంగూనాయక్, శ్రీను నాయక్ పాల్గొన్నారు.

మోర్తాడ్ మండలంలో

మోర్తాడ్: మండలంలోని వడ్యాట్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ నిర్వహించారు. ముత్యాల రాములు, గిర్మాజీ గోపి, నవీన్, పెండెం శ్రీనివాస్, సదానందం గౌడ్, యాటం విజయ్, డాక్టర్ లింబాద్రి, రాజేశ్వర్, బీజీ గంగాధర్, జీఎం రెడ్డి, డాక్టర్ రాములు, దాప రవి, నర్సాగౌడ్, నాగం పోషన్న పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని క్షత్రీయ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నారాయణ పాఠశాల గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్మూర్ జూనియర్ సివిల్ జడ్జి వేములదీప్తి విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. పాఠశాల జోన్ ఏజీఎం శివాజీ, ప్రిన్సిపాల్ రజనికుమారి, ఏవో నవీన్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీని సందర్శించిన విద్యార్థులు

మోర్తాడ్: భీమ్‌గల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం బాసర ట్రిపుల్ ఐటీని సందర్శించారు. మొదట బాసర సరస్వతి మాతను దర్శించుకుని, పూజలు నిర్వహించారు. అనంతరం సారంగపూర్ హనుమాన్ మందిరాన్ని సందర్శించారు. టీచర్లు లింబాద్రి, వాసుదేవ్, ఇమ్మాన్యుయల్ ఉన్నారు.

ఆధ్యాత్మికం..

■ భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



రుద్రూర్: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా, శ్రీరామ రక్ష స్తోత్రం పారాయణం చేశారు. వీరభద్ర స్వామి ఆలయంలో హనుమాన్ మాల ధారణ స్వాములు పడిపూజ చేపట్టారు.

■ ఆలయాల్లో జిల్లా జడ్జి పూజలు

బాల్కొండ: మండల కేంద్రంలోని అయ్యప్ప, మహంకాళీ ఆలయాల్లో శనివారం జిల్లా జడ్జి సునీత కుంచాల, ఆర్మూర్ మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ వేముల దీప్తితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు బూస సునీత, తౌటు గంగాధర్, వకీలు నరహరి పాల్గొన్నారు.

■ హనుమాన్ జయంతి కరపత్రాల ఆవిష్కరణ

బోధన్‌రూరల్: పట్టణంలోని మారుతి మందిర్‌లో శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి కార్యక్రమ కరపత్రాలను అవిష్కరించారు. ఈనెల 10నుంచి 3రోజుల పాటు ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 12న హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 వృషభ-10.30, ఎల్‌వైఎఫ్-1.40, 28సీ-7.55, కోర్ట్-4.45, 10.25

స్క్రీన్-2 సికిందర్ (హిందీ) - 10.00, 1.00, 7.10, 10.10, రాబిన్‌హుడ్-4.00

స్క్రీన్-3 మ్యాడ్ స్క్వేర్-11.20, 2.05, 4.50, 7.35, 10.20

స్క్రీన్-4 కోర్ట్-10.10, రాబిన్‌హుడ్-1.15, 10.20 దీర-4.25, ఆదిత్య369-7.15



మాంసం ధరలు(రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	90,800	వెండి(కిలో)	1,04,000
22 క్యారెట్స్	83,805		

– నిజామాబాద్ బిజినెస్